క్లుప్తంగా

భక్తులతో కిటకిటలాడిన నల్లగంగమ్మ తల్లి ఆలయం



పూజలందుకున్న దేవరరాయి నల్ల గంగమ్మ

సంబేపల్లి : జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన సంబేపల్లిలోని శ్రీదేవరరాయి నల్లగంగమ్మ తల్లి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజామునే పూజలు ప్రారంభమయ్యాయి. దేవరరాయిని భక్తితో భక్తులు పూజించి చిన్న పిల్లల నుంచి పండు ముసలివారి వరకు అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పెద్దఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు.

అనంతపురం గంగమ్మ దేవతకు భక్తుల పూజలు



గంగమ్మ దేవతకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లి : వర్షాలు కురిపించి ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూడు గంగమ్మతల్లీ అంటూ ఆదివారం అనంతపురం గంగమ్మ దేవతకు భక్తులు బోనాలు సమర్పించి, తలనీలాలు అర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు ఆదిమూలం వంశీయులు రెడ్డి శేఖర్, చంద్రశేఖర్‌లు అమ్మవారికి అభిషేకం చేయడంతో పాటు కుంకుమార్చనలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల వారే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రత్యేక అలంకారంలో శ్రీ సత్యమ్మ తల్లి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి జాతీయ రహదారిపై వెలసి ఉన్న శ్రీ సత్యమ్మతల్లికి ఆదివారం మహిళా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేసి కాయా, కర్పూరం, పసుపు, కంకుమలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు.

రెడ్డెమ్మ తల్లీ కరుణించమ్మా!



సంతానం కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేకువజామునే అమ్మవారికి నైవేద్యం సమర్పించి పంచామృతాభిషేకాలు చేశారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి చీరె,సారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదానం చేశారు. పలువురు భక్తులు ఆలయమెట్లకు పూజలు నిర్వహించి మోకాళ్లపై నడుచుకొంటూ మొక్కలు చెల్లించుకొన్నారు. రాయలసీమ జిల్లాలతోపాటు కర్ణాటకా, తమిళనాడు నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు.

ప్రమాదాల నివారణకు డేంజర్ బోర్డులు



దేవగుడిపల్లె వద్ద డేంజర్ బోర్డును ఏర్పాటు చేస్తున్న దృశ్యం

చిన్నమండెం : జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు డేంజర్ బోర్డులు ఎంతగానో ఉపయోగపడతాయని ఎస్ఐ రమేష్‌బాబు పేర్కొన్నారు. దేవగుడిపల్లె గ్రామం వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడటమే కాకుండా పలువురు ఆసుపత్రుల పాలయ్యారు. ఈ విషయాన్ని గుర్తించిన పోలీసులు ఆ ప్రదేశంలో డేంజర్ బోర్డును ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

పచ్చిరొట్ట.. దిగుబడిలో దిట్ట

- భూసారం పెంపునకు ఉపయోగం
- మామిడికి శ్రేయస్కరం



సాగులో ఉన్న పచ్చిరొట్ట ఎరువులు

ఓబులవారిపల్లె : పచ్చిరొట్ట పంట దిగుబడిలో ప్రధాన భూమిక పోషిస్తుంది. భూసారం పెంపులో దిట్ట. నేల స్వభావానికి అనుగుణంగా పచ్చిరొట్ట ఎరువు సాయంతో సారవంతంగా మార్చుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో 70వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి. ఇందులో ప్రధానంగా బొప్పాయి 3500 హెక్టార్లు, అరటి 6000 హెక్టార్లు, నిమ్మతోటలు పదివేల హెక్టార్లు, జామున్ 750 హెక్టార్లు, దానిమ్మ 700 హెక్టార్లలో సాగులో ఉన్నాయి. ఇక ఇతర పంటలైన ఉసిరి, సీతాఫలం, ఖర్జూరం, జామ, దోస, కర్బుజా, సపోటా , తదితర పంటలు కూడా సాగులో ఉన్నాయి. ఫలాల్లో రారాజు అయిన మామిడి మాత్రం గరిష్టంగా 32 వేల హెక్టార్లలో రైతులు సాగు చేస్తున్నారు.

రసాయనిక ఎరువుల వల్ల నష్టం

సాధారణంగా రైతులు పంట వేసే ముందు పంట దిగుబడి కోసం ఎన్నో ఎరువులు వినియోగిస్తుంటారు. అధికంగా దిగుబడి పొందేందుకు ఎక్కువగా రసాయనిక ఎరువులు వినియోగించడం ద్వారా పంట దిగుబడి క్రమంగా తగ్గిపోతుంది. దీంతో రైతులు లక్షలాది రూపాయల వ్యయంతో సాగు చేసిన పంటలు దిగుబడి రాక పోవడంతో నష్టాలు మిగులుతున్నాయి.

పచ్చిరొట్ట ఎరువులతో ఖర్చు తక్కువ.. ఆదాయం ఎక్కువ

పచ్చిరొట్ట ఎరువుల వినియోగం ద్వారా రైతులకు ఖర్చు తక్కువతో పాటు ఆదాయం పెరుగుతుంది. దీని ద్వారా భూమి సారవంతం కావడమే కాకుండా కలుపు మొక్కలను నివారిస్తూ రైతులకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి అందిస్తుంది. ముఖ్యంగా మామిడి పంటను సాగు చేసే రైతులు కాయల కోత అనంతరం ఇరవై రోజులు విశ్రాంతి తర్వాత కొమ్మలు కత్తిరించాలి. వర్షం కురిసిన తర్వాత పచ్చిరొట్ట ఎరువులు చల్లుకోవాలి. ఈ పచ్చరొట్టను సాగు చేసిన 40 రోజుల తరువాత భూమిలో కలియదున్నడంతో భూమి ఎంతో సారవంతం అవుతుంది. ఎకరాకు పన్నెండు నుంచి పద్నాలుగు కిలోల విత్తనాలను పొలంలో చల్లుకోవాలి. ఈ విధంగా చేయడం వల్ల సేంద్రియ ఎరువులు.. అందులో ఉన్న పోషకాలు మొక్కలకు సరైన మోతాదులో అందుతాయి. అంతే కాకుండా కలుపు మొక్కల ఉధృతి కూడా తగ్గుతుంది. జనుము, జీలుగ, సీమజీలుగ, పిల్లిపెసర, తదితర వాటిని పచ్చరొట్ట ఎరువులుగా వినియోగించవచ్చు.

జీలుగ, సీమ జీలుగ..

క్షార గుణం గలిన భూములు, చౌడు భూముల్లో వేయవచ్చు. ఎకరానికి పది నుండి పన్నెండు కిలోల విత్తనం ఇసుకతో కలిపి చల్లడం వల్ల పొలం అంతా సమానంగా పడుతుంది. దీనిని పూత దశలో కలియదున్నడం వల్ల ఎకరానికి తొమ్మిది నుండి పది టన్నుల పచ్చి రొట్ట లభిస్తుంది.

కట్టె జనుము

అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చు. పచ్చిరొట్టగా పశువుల మేతగా ఉపయోగించ వచ్చు. ఎకరానికి పన్నెండు నుండి పదిహేను కిలోల విత్తనం చల్లుకోవాలి. ఎకరానికి ఐదు నుండి ఆరు టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది.

పిల్లి పెసర

దీనిని తేలిక, బరువైన నేలల్లో సాగు చేయవచ్చు. చౌడు భూముల్లో సాగుకు పనికిరాదు. ఎకరానికి ఆరునుండి ఎనిమిది కిలోల విత్తనం అవసరం. ఎకరానికి మూడునుండి నాలుగు టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది.

నీలి, వెంపలి

ఇవి చాలా ప్రదేశాల్లో కలుపు మొక్కలుగా కనిపిస్తాయి. వీటిని పచ్చిరొట్ట ఎరువులుగా వాడుకోవచ్చు. ఎకరాకు ఎనిమిది నుండి పది కిలోల విత్తనం సరిపోతుంది. అన్ని రకాల నేలల్లో వినియోగించవచ్చు.

రైతులకు దశలవారీగా అవగాహన కల్పించాలి



గత సంవత్సరం మామిడి పంటకు ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రైతులకు దశలవారీగా అవగాహన కల్పించాలి. మామిడి రైతులకు ఒకే సారి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించకుండా ప్రతి నెల మామిడి తోటల్లో చేయాల్సిన పనులపై అవగాన కల్పించాలి. 2024 మార్చి నెలలో ఎగుమతిదారులు రైతుల సమావేశాలు ఏర్పాటు చేసి రైతుకు మంచి ధరవచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

-పంజం సూకుమార్‌రెడ్డి జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు

పచ్చిరొట్ట ఎరువులు రైతులు వినియోగించాలి



జిల్లాలో రైతులు వరి, మామిడి తోటల్లో పచ్చరొట్ట ఎరువులుగా జనుము, జీలుగ, పిల్లిపెసర వంటివి వినియోగిస్తుంటారు. దీని దృష్టిలో ఉంచుకొని అన్ని మండలాలకు జనుము పన్నెండు వందల క్వింటాలు, జీలుగ 1500 క్వింటాలు, పిల్లిపెసర 150 క్వింటాలు, పిల్లిపెసర 150 క్వింటాలు మొత్తం 2850 క్వింటాలు తెప్పించి జిల్లాలోని ప్రతి ఆర్‌బీకే పరిధిలో ఉంచాము. ప్రతి రైతు వీటిని పచ్చరొట్ట ఎరువుగా వినియోగించి అధిక దిగుబడులు సాధించాలి.

- చంద్రానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి

సర్వే నంబర్ 937లో పనులు నిలిపివేత



ప్రభుత్వ స్థలంలో పనులను నిలిపివేస్తున్న పోలీసులు

సిద్దవటం : పెద్దపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని మాధవరం–1 గ్రామ పంచాయతీలో సర్వే నంబర్ 937లో చేస్తున్న పనులను సిద్దవటం పోలీసులు నిలిపివేశారు. కొంత మంది ప్రభుత్వ డీకేటీ భూములను ఆదివారం చదును చేస్తుండగా స్థానికులు కడప డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ప్రాంతానికి సిద్దవటం పోలీసులు చేరుకొని పనులను నిలిపేశారు. సంబంధిత భూమికి సంబంధించి మీవద్ద ఏవైనా పత్రాలు ఉన్నట్లయితే తీసుకు రావాలని అంతవరకు పనులు చేయవద్దని పోలీసులు వారికి సూచించారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

రాజంపేట టౌన్ : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో మంగళవారం ఉదయం 10–30 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఫణిరాజకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. మండలాధ్యక్షుడు వై.వెంకటనారాయణ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్నిశాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఆమె కోరారు.

నేడు స్పందన కార్యక్రమం

పుల్లంపేట : పుల్లంపేటలో సోమవారం జరగనున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నరసింహకుమార్ తెలిపారు. మండల ప్రజలకు ఏవైనా రెవెన్యూ సమస్యలు ఉంటే అర్జీలు సమర్పిస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

వేడుకగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చిన్నమండెం జెడ్పీ హైస్కూల్‌కు కంప్యూటర్, ప్రింటర్‌లను బహూకరిస్తున్న పూర్వ విద్యార్థులు

చిన్నమండెం : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1984–85 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం హెచ్‌ఎం శ్రీరాములు అధ్యక్షతన వేడుకగా జరిగింది. వంద మంది పూర్వ విద్యార్థులకు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి పండుగ వాతావరణంలో తమ మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సత్కరించారు. తమ జ్ఞాపకాలకు గుర్తుగా పూర్వ విద్యార్థులు పాఠశాలకు ఒక కంప్యూటర్, ప్రింటర్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు, వారి బంధువులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

20న గర్భిణులకు సీమంతం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట రూరల్ : ఈ నెల 20వ తేదీన గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఆదివారం రాజంపేట, నందలూరు, సిద్దవటం, ఒంటిమిట్ట, వీరబల్లి, సుండుపల్లి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లోని అంగన్‌వాడీ సూపర్ వైజర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఐసీడీఎస్, ఆరోగ్యశాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. గతంలో ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్టు ద్వారా ఎన్నో సీమంతం కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ సీడీపీఓ వై. సుజామణి, డిప్యూటి డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎస్.చిన్నికృష్ణ, వైద్యులు లక్ష్మిప్రసన్న, మస్తాన్‌బీ, అశోక్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండుగోపీ, జెడ్పీటీసీ దాసరి ప్రశాంతి భర్త దాసరి పెంచలయ్య, ఎంసీహెచ్‌ఈఓ, సీహెచ్‌ఓల సంఘం గౌరవాధ్యక్షుడు పిల్లి పిచ్చయ్య, సీహెచ్‌ఓ జీవీ రాజమ్మ, టీబీ సూపర్‌వైజర్ పిల్లి జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మానాయక్‌కు సన్మానం



ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి ధర్మానాయక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రాయచోటి : కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నిజామాబాద్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్‌గా ఎంపికైన బి.ధర్మానాయక్‌ను టీటీడీ గోశాల సభ్యుడు దేవపట్ల రామ సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. రాయచోటిలోని శ్రీదేవపట్ల హరినాథ్ రెడ్డి డిగ్రీ కాలేజీలో ఆదివారం ఈ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. యూపీఎస్‌సీ పరీక్షల్లో ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్‌లో తమ కళాశాల పూర్వ విద్యార్థి ధర్మనాయక్ ఎంపిక కావడం హర్షనీయమని ఆ కళాశాల కరస్పాండెంట్, టీటీడీ గోశాల సభ్యుడు రామ సునీల్ రెడ్డి అన్నారు. విధి నిర్వహణలో బాగా పనిచేసి ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా ధర్మానాయక్‌కు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రెడ్డప్ప రెడ్డి, ఇన్‌చార్జి జనార్దన్ రెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మకాపు.. భలే ఊపు

అధిక ధరలు అమ్ముతున్న మామిడి



యార్డులో ఉన్న ఉమ్మకాపు కాయలు

రైల్వేకోడూరు అర్బన్ : ఈ ఏడాది మామిడికాయల వ్యాపారం అంతంత మాత్రంగా జరిగింది. వేసవి కాలం ఎండలు అధికంగా ఉండటం వల్ల ఏప్రిల్, మే నెలల్లో మామిడిపంట పిందె దశలో రాలిపోయి మామిడికాయల కాపు అంతంత మాత్రంగా వచ్చింది. రైల్వేకోడూరు మార్కెట్ యార్డులో యేటా కోట్లలో వ్యాపారాలు జరిగేవి. అయితే ఈ యేడాది మామిడి అంతంత మాత్రంగా ఫలితాలు వచ్చాయి. మామిడి సీజన్ ముగిశాక సెప్టెంబర్, అక్టోబర్ నెలలో వచ్చే కొన్ని రకాల ఉమ్మకాపు మామిడి కాయల ధరలకు ఊపు వచ్చింది. కిలో 50 రూపాయల నుండి 60 రూపాయల వరకు రైతులకు ధర ఇస్తున్నారంటే డిమాండ్ ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. మార్కెట్‌లో మాత్రం 100 రూపాయలు అమ్ముతున్నారు. కొందరు రైతులు ఉన్న కొన్ని మామిడికాయలను యార్డుకు తరలిస్తున్నారు. మరికొందరు మాత్ర ఆటోలలో తిరుపతి మార్కెట్‌కు తీసుకెళ్తున్నారు.



చెట్టుకు ఉన్న ఉమ్మకాపు కాయలు

పంట లేనప్పుడు ధరలు ఉంటాయి



సాధారణంగా మామిడి పంట ఉన్నప్పుడు ఇదే 50, 60 రూపాయల ధరలు ఉంటే రైతులకు కనక వర్షమే. కానీ ఈ ధరలు దిగుబడి వచ్చేటప్పుడు ఉండవు. కొంత మేరకే ఉమ్మకాపు వచ్చినా ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. పెట్టుబడులకు సహాయంగా ఉంటాయి.

-మల్లు రఘురామిరెడ్డి, రాఘవరాజపురం, కోడూరు మండలం

పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలి

బద్వేలు అర్బన్: పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని ఎస్టీయూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి అన్నారు. స్థానిక గాయత్రి జూనియర్ కళాశాల ఆవరణలో రీజనల్ కన్వీనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన బద్వేలు రీజియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, వెంకటసుబ్బయ్య, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బాలగంగిరెడ్డి, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా లీగల్ కన్వీనర్‌గా శివకుమార్

కడప కోటిరెడ్డిసర్కిల్ : తొండూరు మండలం మల్లెల గ్రామానికి చెందిన గామిరెడ్డి శివకుమార్‌ను వైఎస్సార్ కడప జిల్లా బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్‌గా నియమించారు. జిల్లా లీగల్ కన్వీనర్‌గా అవకాశం కల్పించినందుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డికి శివకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. శివకుమార్ కడప జిల్లా కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎస్‌వీఎస్ ప్రసాద్

కడప కోటిరెడ్డి సర్కిల్/అర్బన్: విశ్రాంత అటవీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర విశ్రాంత అటవీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్‌వీఎస్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం సంఘం ఆధ్వర్యంలో కడప అటవీ అతిథిగృహ ఆవరణంలో సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత అటవీ ఉద్యోగులకు చాలామందికి ఫించన్లు అందడం లేదని, అలాగే వారికిఆర్థిక బెనిఫిట్లు రావడం లేదని తెలిపారు. ఈసమస్యల పరిష్కారానికి తమ సంఘం కృషి చేస్తుందన్నారు. అనంతరం 70 సంవత్సరాలు దాటిన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూర్ణచంద్రరావు, కార్యదర్శి గాలిబ్, రాష్ట్రకోశాధికారి శ్రీరాములు పాల్గొన్నారు.

29న ప్రొద్దుటూరు హాఫ్ మారథాన్

ప్రొద్దుటూరు కల్చరల్: జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా ప్రొద్దుటూరులో ఈ నెల 29న ఉద యం ఆరు గంటలకు హాఫ్ మారథాన్–2023 నిర్వహించనున్నట్లు ఐఆర్‌ఎస్ అధికారి ఉండేల రామనాథరెడ్డి తెలిపారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో జరిని కార్యక్రమంలో క్రీడాకారుల టీ షర్ట్స్, మెడల్స్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని పురస్కరించుకుని 2023 ఐరన్ మ్యాన్ రన్ ఫర్ యూనిటీని రాయల్ కౌంటీ బైపాస్ వద్ద నుంచి ప్రారంభిస్తామని తెలిపారు. దీంతోపాటు ఐదు, పది, 21.1 కిలోమీటర్ల పరుగు పందెం నిర్వహిస్తామని, ఎవరైనా పాల్గొనవచ్చునని తెలిపారు. 5 కిలోమీటర్ల పందెం విజేతలకు వరుస బహుమతులుగా రూ.7 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు, పది కిలోమీటర్ల విజేతలకు రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, 21.1 కిలోమీటర్ల విభాగంలో విజేతలకు రూ.21 వేలు, రూ.16 వేలు, రూ.10 వేలు ఇస్తామని తెలిపారు.

అభివృద్ధిని ప్రతి ఇంటికీ తెలియజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



సమావేశానికి హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు

కడప కార్పొరేషన్: జగనన్న ప్రభుత్వం చేస్తున్న అసలైన అభివృద్ధిని ప్రతి ఇంటికీ తెలియజేయాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అపూర్వ కళ్యాణ మండపంలో సౌత్ జోన్(క్లస్టర్–3) పరిధిలోని కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. మొదట దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' కార్యక్రమం నెల రోజుల పాటు సాగుతుందన్నారు. ఇందులో భాగంగా సచివాలయ శిబిరాలు నిర్వహించి, ప్రజలకు అందించిన ప్రయోజనాలను ప్రదర్శించాలన్నారు. జగనన్న ఇచ్చిన హామీలు ఎలా నెరవేర్చారు, చంద్రబాబు హామీలు ఇచ్చి ఎలా మాట తప్పారనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి సచివాలయంలో ఒక రోజు గడిపి సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించాలని, వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలన్నారు. గ్రామ, వార్డు పెద్దలతో డిన్నర్, రాత్రి బస వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాలను సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ముందుండి నడిపించాలని, కార్పొరేటర్లను భాగస్వామ్యం చేయాలన్నారు. క్లస్టర్–3 ఇన్‌చార్జి తోటక్రిష్ణ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు మనందరం సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, జయచంద్రారెడ్డి, ఎస్. సుబ్బారెడ్డి, బంగారు నాగయ్య, కార్పొరేటర్లు ఆర్. చెన్నయ్య, ఎం. సుబ్బారెడ్డి, మల్లికార్జున, నాగేంద్ర, కె. సూర్యనారాయణరావు, డివిజన్ ఇన్‌చార్జులు ఏ. బాలక్రిష్ణారెడ్డి, ఆర్‌వీ రమణ, బండి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తోటక్రిష్ణకు సన్మానం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సౌత్ జోన్(క్లస్టర్–3) అధ్యక్షుడిగా తోటక్రిష్ణాంజనేయులు ఆదివారం ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. స్థానిక అపూర్వ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు పాల్గొన్నారు.